ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 24.10.2024 సమయం 19.05 గంటలు

ముఖ్యాంశాలు

1. వాస్తవాధీన రేఖ వెంబడి కొన్ని ప్రాంతాల్లో విభేదాలను పరిష్కరించుకునేందుకు భారత్ – చైనాలు దౌత్య, సైనిక స్థాయి చర్చలు జరుపుతున్నట్లు రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ చెప్పారు.
2. ఇటీవల ఆమోదించబడిన బయో-ఇ3 విధానం భారతదేశ హరిత పరివర్తన, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.
3. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి మీదుగా ఎర్రుపాలెం - నంబూరు మధ్య 57 కిలోమీటర్ల మేర 2 వేల రెండు వందల కోట్ల రూపాయల వ్యయంతో కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ కమిటీ ఈరోజు ఆమోదం తెలిపింది.
4. పూణేలో జరుగుతున్న మొదటి టెస్ట్ మ్యాచ్ రెండవ రోజు ఆటలో ఈరోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఒక వికెట్ నష్టపోయి 16 పరుగులు చేసింది.

-------

**RAJNATH INDIA CHINA**

వాస్తవాధీన రేఖ వెంబడి కొన్ని ప్రాంతాల్లో విభేదాలను పరిష్కరించుకునేందుకు భారత్ – చైనాలు దౌత్యపర, సైనిక స్థాయి చర్చలు జరుపుతున్నట్లు రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ చెప్పారు. కొత్త ఢిల్లీలో 2024 చాణక్య రక్షణ చర్చలు ప్రారంభ సభలో రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ – ఈ చర్చల దరిమిలా సమానత్వం, పరస్పర భద్రత అనే సూత్రాల ఆధారంగా

వాస్తవ పరిస్థితిని పునరుద్ధరించేందుకు విస్తృత ఏకాభిప్రాయం సాధించినట్లు చెప్పారు. ఈ ఏకాభిప్రాయంలో సంప్రదాయ ప్రాంతాల నిఘా గస్తీ మొదలైనవి ఉన్నాయని చెప్పారు. నిరంతర చర్చలు జరిపితే ముందుగా కాని, ఆలస్యంగా కానీ పరిష్కారాలు లభిస్తాయిన రాజ్ నాధ్ సింగ్ చెప్పారు. ఈనాటి సాంకేతిక యుగంలో కంప్యూటర్స్, సమాచార సాంకేతిక పరిజ్ఞానం ఆధునికీకరణ, ఉపగ్రహ కమ్యూనికేషన్, కృత్రిమ మేధ క్వాంటమ్ కంప్యూటింగ్ లు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పరివర్తన చేస్తున్నాయని రక్షణశాఖ మంత్రి చెప్పారు.

## PRESIDENT CHHATTISGARH

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపటి నుంచి ఛత్తీస్‌గఢ్‌లో రెండు రోజుల పర్యటన చేపట్టనున్నారు. రాష్ట్రపతి రేపు రాయ్‌పూర్‌లోని AIIMS 2వ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. రాయ్‌పూర్‌లోని NIT 14వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ము నయా రాయ్‌పూర్‌లోని పుర్‌ఖౌతి ముక్తంగన్‌ను సందర్శిస్తారు. శనివారం భిలాయ్‌లోని ఐఐటీ నాలుగో స్నాతకోత్సవంలో పాల్గొంటారు. రాయ్‌పూర్‌లోని పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ స్మారక ఆరోగ్య విజ్ఞాన ఆయుష్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో రాష్ట్రపతి పాల్గొంటారు.

## JITENDRA-INDO-GERMANY

ఇటీవల ఆమోదించబడిన బయో-ఇ3 విధానం భారతదేశ హరిత పరివర్తన, ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. BioE3 అంటే బయోటెక్నాలజీ ఫర్ ఎకానమీ, ఎన్విరాన్‌మెంట్, ఎంప్లాయ్‌మెంట్ విధానం అని అర్థం. కాగా దేశంలో అధిక పనితీరు గల బయో మాన్యుఫ్యాక్చరింగ్‌ను ప్రోత్సహించడానికి ఈ విధానం ఉద్దేశించబడింది. కొత్తఢిల్లీలో ఈరోజు జరిగిన ఇండో-జర్మన్ సైన్స్ అండ్ టెక్నాలజీ సహకార స్వర్ణోత్సవ వేడుకలను ఉద్దేశించి మంత్రి ప్రసంగిస్తూ, తమ ప్రభుత్వ హయాంలో దేశం శాస్త్ర సాంకేతిక రంగంలో గట్టి వృద్ధిని సాధించిందని అన్నారు.

## REV. GADKARI-ROAD SAFETY

రోడ్డు భద్రత పర్యావరణ వ్యవస్థలో కృత్రిమ మేధ వినియోగం వంటి అన్ని రకాల అధునాతన సాంకేతికతలను ప్రభుత్వం అమలు చేస్తోందని కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈరోజు కొత్త ఢిల్లీలో జరుగుతున్న ట్రాఫిక్ ఇన్‌ఫ్రాటెక్ ఎక్స్ పో 12వ ఎడిషన్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణంలో అత్యంత అధునాతన సాంకేతికతను అవలంబించాలని నొక్కి చెప్పారు. వాహనదారులకు రోడ్లు సురక్షితంగా ఉండేలా రోడ్డు నిర్మాణంలో తమ ఉత్తమ విధానాలను అమలు చేయడానికి గాను ప్రతిభావంతులైన ఇంజనీర్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఆయన తెలిపారు. కాగా ఎక్స్ ప్రెస్ మార్గాలు, అందుబాటు నియంత్రిత రహదారులను భారత జాతీయ ప్రధాన రహదారుల సాధికార సంస్థ చాలా నిర్మిస్తోందని, దీని వల్ల ప్రమాదాల సంఖ్య తగ్గుతుందని నితిన్ గడ్కరీ చెప్పారు. రోడ్డు భద్రత కోసం ప్రైవేట్ రంగానికి చెందిన నిపుణులను మంత్రిత్వ శాఖ నియమిస్తున్నట్లు ఆయన తెలిపారు. చట్టాన్ని అమలు చేయడం, టోల్‌లను నిర్వహించడం, రహదారి నాణ్యతపై ఈ నిపుణులు నిఘా పెడతారని చెప్పారు.

## ODISHA AIRPORTS-BOMB THREATS

ఒడిశాలోని భువనేశ్వర్, ఝార్సుగూడ విమానాశ్రయాలలో ఈ మధ్యాహ్నం అత్యంత అప్రమత్తం ప్రకటించారు. ట్విట్టర్ హ్యాండిల్ నుండి బాంబు బెదిరింపులు రావడంతో వెంటనే బాంబు, డాగ్ స్క్వాడ్‌లను మోహరించారు. అనంతరం భద్రతా తనిఖీల్లో ఎలాంటి బాంబులు లభ్యం కాకపోవడంతో అది బూటకమని విమానాశ్రయ అధికారులకు సమాచారం అందింది. మధ్యాహ్నం వచ్చిన బెంగళూరు-భువనేశ్వర్ ఎయిర్ ఆకాష్ విమానంలో బాంబు ఉందని ఎక్స్ సామాజిక వేదికలో వచ్చిన పోస్ట్ నుండి తమకు బాంబు బెదిరింపు వచ్చినట్లు భువనేశ్వర్‌లోని బిజు పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయ అధికారులు తెలిపారు. విమానాశ్రయాన్ని వెంటనే భద్రతా సిబ్బంది చుట్టుముట్టి విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో సహా విస్తృతంగా సోదా జరిపారు. బెంగళూరు-జార్సుగూడ ఇండిగో విమానానికి సంబంధించి

ఝూర్సుగూడలోని వీర్ సురేంద్ర సాయి విమానాశ్రయ అధికారులకు కూడా బాంబు బెదిరింపు వచ్చింది. అయితే క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత ఈ  బెదిరింపు కూడా బూటకమని నిర్ధారించారు.

## RAJIV RANJAN-LIVESTOCK CENSUS

కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ రేపు కొత్త ఢిల్లీలో 21వ పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాల సహకారంతో వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఈ పశు గణనను నిర్వహించనున్నారు. పశువైద్యులు , పారా వెటర్నరీ వైద్యులు, దాదాపు లక్ష మంది క్షేత్రస్థాయి అధికారులు ఈ గణన ప్రక్రియలో పాల్గొంటారు. భారతదేశంలో జంతు ఆరోగ్య మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ఈ చర్య లక్ష్యం.

## UNITED NATIONS DAY

ఈరోజు ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. అంతర్ ప్రభుత్వ సంస్థ అయిన అంతర్జాతీయ దౌత్యం, మానవతావాద ప్రయత్నాలు, ప్రపంచ అభివృద్ధిలో ఐక్యరాజ్యసమితి కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సంస్థ ను అధికారికంగా ఈరోజు స్థాపించారు.   1945లో ఐక్యరాజ్యసమితి చార్టర్ అమల్లోకి వచ్చిన వార్షికోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 24న ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని జరుపుకుంటారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత దేశాల మధ్య శాంతి, భద్రత, సహకారాన్ని పెంపొందించడానికి ఐక్యరాజ్యసమితి స్థాపితమైంది. 25 ఏప్రిల్ 1945న, శాన్ ఫ్రాన్సిస్కోలో 50 మంది ప్రభుత్వ ప్రతినిధులు ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను రూపొందించడానికి సమావేశమయ్యారు. ఈ ముసాయిదా జూన్ 25న ఆమోదించబడింది. ఐక్యరాజ్యసమితి ఆవిర్భావానికి గుర్తుగా అక్టోబర్ 24న అధికారికంగా వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంటారు.

## EVE CRICKET - IND NZ

పూణేలో జరుగుతున్న మొదటి టెస్ట్ మ్యాచ్ రెండవ రోజు ఆటలో ఈరోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఒక వికెట్ నష్టపోయి 16 పరుగులు చేసింది. దీంతో ఈరోజు ఆట ముగిసింది. అంతకుముందు న్యూజిలాండ్ 259 పరుగులకు ఆలౌట్ అయింది. వాషింగ్టన్ సుందర్ 5 వికెట్లు తీసుకున్నారు. న్యూజిలాండ్ ఆటగాడు దేవన్ కాన్వే 76 పరుగులు , రజనీ రవీంద్ర 65 పరుగులు చేశారు. అంతకుముందు న్యూజిలాండ్ టాస్ గెలిచి, బ్యాటింగ్ ఎంచుకుంది. 3 మ్యాచ్ ల ఈ పరంపరలో భారత్ 1-0తో వెనుకంజలో ఉంది.

## RAILWAYS- SPECIAL TRAINS

దీపావళి, ఛత్ పూజ పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే మంత్రిత్వ శాఖ ఏడు వేల ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ ప్రత్యేక రైళ్లలో రోజుకు రెండు లక్షల మంది అదనపు ప్రయాణికులు ప్రయాణించవచ్చని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కొత్తఢిల్లీలో తెలిపారు. గతేడాది నాలుగు వేల ఐదు వందల రైళ్లు నడపగా, ఈ ఏడాది ప్రత్యేక రైళ్ల సంఖ్యను ఏడు వేలకు పెంచామని ఆయన చెప్పారు.

### MANN KI BATH

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ, విదేశాలలోని ప్రజలతో తన మనసులోని ఆలోచనలను పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం వచ్చే ఆదివారం 27వ తేదీన ఆకాశవాణిలో ప్రసారమవుతుంది. ప్రతి నెలా ప్రసారమయ్యే రేడియో కార్యక్రమంలో ఇది 115వ ఎపిసోడ్. కాగా, ఈ కార్యక్రమానికి ప్రజలు తమ ఆలోచనలు, సూచనలను టోల్ ఫ్రీ నంబర్ 1800-11-7800 ద్వారా పంపించవచ్చు. ప్రజలు తమ సలహాలు, సూచనలను నరేంద్ర మోదీ యాప్ లేదా MyGov ఓపెన్ ఫోరమ్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా పంపించవచ్చు.